క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఎక్సైజ్ డీసీ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎక్సైజ్ డీసీ శ్రీకాంత్‌రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగం డిప్యూటీ కమిషనర్ దోసకాయల శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని కలిశారు. గురువారం ఈయన ఎచ్చెర్ల కొయిరాళ్లలో ఉన్న కార్యాలయంలో (అప్పటి సెబ్ అదనపు ఎస్పీ కార్యాలయం) విధుల్లో చేరిన విషయం విదితమే. ఎస్పీతో పలు అంశాలపై డిప్యూటీ కమిషనర్ చర్చించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈగా దుర్యోధన్



రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గ గ్రామీణ నీటి సరఫరా డీఈగా దుర్యోధన్ శుక్రవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు పలాసలో పని చేసి ఇక్కడకు విచ్చేశారు. గతంలో పని చేసిన సూర్యనారాయణ పలాస బదిలీపై వెళ్లారు.

నేడు అరసవల్లి ఆలయ ఈవో భద్రాజీ బాధ్యతల స్వీకరణ



వై.భద్రాజీ, ఈవో

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ఈవో వై.భద్రాజీ శనివారం ఉదయం బాధ్యతలను స్వీకరించనున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లా నుంచి ఇక్కడికి రానున్నారు. కొత్త ఈవో రాక సందర్భంగా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా సహాయ కమిషనర్‌గా, ఇదే ఆలయంలో ఈవో/అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన భద్రాజీ మళ్లీ ఇక్కడికే డిప్యూటీ కమిషనర్ /ఈవోగా రానుండడం గమనార్హం. ఇప్పటి వరకు ఈఓగా పనిచేసిన డీఎల్‌వీ రమేష్‌బాబు కాకినాడ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.

సెమిస్టర్-2 పుస్తకాలు అందజేత



పుస్తకాలను అందజేస్తున్న ఎంఈవోలు

జి.సిగడాం: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం సెమిస్టర్-2 పుస్తకాలను ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు ఉపాధ్యాయులకు శుక్రవారం అందజేశారు. వీటిని ఈనెల 30వతేదీలోగా విద్యార్థులకు అందించాలని సూచించారు. స్థానిక ప్రధానోపాధ్యాయలు చీర రాము, సీఆర్పీలు ఉన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



ఉప్పివలసలో మొక్కలు నాటుతున్న దృశ్యం

రణస్థలం: ప్రతీ వ్యక్తి తన పుట్టిన రోజున కచ్చితంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలనే సంప్రదాయాన్ని బాల్యదశ నుండే అలవర్చుకోవాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. హరిత సొసైటీ సభ్యుల పుట్టిన రోజు సందర్భంగా ఉప్పివలస గ్రామంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో, పనిచేసే ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటితే మన గుర్తుగా తరతరాలు ఉంటాయన్నారు. సొసైటీ సభ్యులు తవిటినాయుడు, బి.లక్ష్మీనరసింహమూర్తి, పల్లి మహేష్, రత్నాకర్, ఆర్.మధు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిసుస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: స్వర్ణాంధ్రప్రదేశ్-2047 సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో లావేరు మండలం బయ్యన్నపేట ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. వక్తృత్వ పోటీల్లో కీర్తిశ్రీ ప్రథమ, వ్యాసరచన పోటీలో ఎనిమిదో తరగతి విద్యార్థి ఆరంగి సాయిమణికంఠ తృతీయ బహుమతిని పొందారు. వీరిని ఎంపీడీవో కొండలరావు, ఎంఈవో మురళీకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు శుక్రవారం అభినందించారు.

ఎన్నాళ్లీ ట్రాఫిక్ కష్టాలు?



కిలోమీటరు మేర నిలిచిన వాహనాలు

- రాగోలు రోడ్డులో కిలోమీటరు మేర నిలిచిపోతున్న వాహనాలు
- భారీ వాహనాలు, రోడ్డు పనుల్లో జాప్యమే కారణం
- ట్రాఫిక్ మళ్లిస్తేనే సమస్యకు పరిష్కారమంటున్న స్థానికులు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం కొత్తరోడ్డు నుంచి రాగోలు మీదుగా ఆమదాలవలస వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. ప్రస్తుతం రాగోలు నుంచి కొంతమేరే రోడ్డు పనులు జరగడం, అక్కడి నుంచి మరికొంత మేర గోతులు ఏర్పడటం, పెద్దపెద్ద వాహనాలు నిత్యం ఈ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుండటంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. కిలోమీటరు మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ప్రధానంగా ఆమదాలవలస నుంచి వచ్చే పెద్దపెద్ద వాహనాలను చింతాడ, నైరా రోడ్డు గుండా పంపించడం, శ్రీకాకుళం మీదుగా వచ్చే భారీ వాహనాలను కొత్తరోడ్ నుంచి పెదపాడు జాతీయరహదారి మీదుగా పంపిస్తే సమయభావంతో పాటు ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం ఉండదని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు, రూరల్ పోలీసులు స్పందించి ట్రాఫిక్‌ను మళ్లించాలని పలువురు కోరుతున్నారు.



కొత్తరోడ్ వద్ద ట్రాఫిక్ జామ్



బారులు తీరిన వాహనాలు

పెద్ద వాహనాలను మళ్లించాలి



ప్రస్తుతం రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో పెద్దపెద్ద వాహనాలను మళ్లిస్తే బాగుంటుంది. ఒక వాహనం నిలిచిపోతే దాని వెనుక వందలకొద్దీ వాహనాలు క్యూలు కడుతున్నాయి. పెద్ద వాహనాలతోనే ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది.

– బి.రాజేష్, రాగోలు

అధికారులు స్పందించాలి



ప్రస్తుతం రోడ్డు పనులు జరుగుతున్న సమయంలో ద్విచక్ర వాహనచోదకులు ఓవర్ టేకింగ్ చేసేటప్పుడు సమన్వయం పాటించాలి. తొందరపడితే గోతుల్లో పడక తప్పదు. అధికారులు కూడా సమస్యపై దృష్టి పెట్టాలి.

– జాన్, శ్రీకాకుళం

ఆర్థిక వ్యవస్థలో టూరిజం పాత్ర కీలకం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్ర, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు



పర్యాటకంపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బి.ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ : ఆర్థిక వ్యవస్థలు బలపడటంలో టూరిజం పాత్ర కీలకంగా మారుతోందని జిల్లా సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హిస్టరీ, టూరిజం విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు.ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ప్రసాదరావు మాట్లాడుతూ దేశం , రాష్ట్రంలో రోజురోజుకూ పర్యాటక రంగం ఎంతగానో అభివృద్ధి చెందుతోందన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో హిస్టరీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.చిన్నారావు, ఇంటాక్ పూర్వపు కన్వీనర్ రాధాప్రసాద్, ఇంటాక్ కో-కన్వీనర్ నటుకుల మోహన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శంకర్‌నారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, డాక్టర్ ఎం.జోగినాయుడు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పర్యాటక వైభవంపై కవిత..

శ్రీకాకుళం కల్చరల్: పర్యాటక దినోత్సవం సందర్భంగా చైతన్య కిరణాల అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు సిక్కోలు పర్యాటక వైభవంపై కవితను చదివి పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శోధన కల్చరల్ సంస్థ కో-ఆర్డినేటర్ ఉమామహేశ్వరరావు, బాలరంజని అధ్యక్షుడు మణిపాత్రుని నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు వి.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని.. దీనికోసం గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని ఐసీడీఎస్ ఎచ్చెర్ల ప్రాజెక్టు సీడీపీవో దోల పాపినాయుడు అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన జి.సిగడాంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, కిశోర్ బాలికలంతా పౌష్టికాహారంతోపాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సకాలంలో తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం గ్రామస్థాయిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఏఎన్‌ఎంలు ప్రత్యేక నిఘా వేయాలన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ జేశారు. ఎంఈవో అరసాడ రవి, సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి ఉన్నారు.

మాతా శిశు సంరక్షణే లక్ష్యం



పోషకాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్, అధికారులు

గార: మాతా శిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండల ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం పోషణ అభిమాన్ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డకు తల్లి పాలు తప్పక అందించాలన్నారు. అనంతరం సీమంతాలు నిర్వహించారు. పోషకాహార స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమంలో ఐసీడీయస్ పీడీ శాంతిశ్రీ, ఎంపీపీలు గొండు రఘురామ్, అంబటి నిర్మలా శ్రీనివాస్, గుండ భాస్కరరావు, సర్పంచ్‌లు కొంక్యాన ఆదినారాయణ, పీస గోపి, పీస శ్రీహరి రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

జి.సిగడాం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలోకి తీసుకెళ్తామని బీజేపీ మండల ఇన్‌చార్జి బూరాడ వెంకటరమణ, మండల అధ్యక్షుడు వజ్జిపత్తి రఘురాం అన్నారు. డి.ఆర్.వలస, గెద్దకంచరాం, బాతువ గ్రామాల్లో శుక్రవారం చేపట్టిన సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మాట్లాడారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలున్న ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు అధికారి శోభారాణి అన్నారు. పోషకాహార మాసోత్సవాలు పురస్కరించుకుని నగరంలోని కృష్ణాపార్క్ సెక్టార్ పరిధిలోని దూదివారి సందు, తుమ్మవీధి, కత్తిరి వీధి 1, 2, కొన్నవీధి, బర్మా కొలని, గార వీధి, రైతుబజారు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలు గల ఆహారం తీసుకుంటేనే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పోషకాహార స్టాల్‌లను పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి ప్రారంభించి పోషక విలువల ఆవశ్యకతను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వార్డ్ ఇన్‌చార్జి ఇప్పిలి తిరుమలరావు, ఎంఎస్‌కే హిమబిందు, ఆశవర్కర్ శశికళ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, సంధ్యారాణి, నీలవేణి, ఇందిర, ప్రసన్న, సునీత, హైమ, అరుణ, విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లిస్తారా..?



మద్యం సరఫరా చేస్తున్న ప్రైవేట్ ట్రక్కులు

ఎచ్చెర్ల క్యాంపస్: త్వరలో ప్రైవేట్ మద్యం విధానం ప్రారంభం కానుంది. ప్రభుత్వ మద్యం షాపులకు మద్యం సరఫరా చేసిన ట్రాన్స్‌పోర్టు వాహనాలకు ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ బకాయిలు చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని నెలల నుంచి మద్యం సరఫరా చేస్తున్న వాహనాల యజమానులు బకాయిల చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. అనేక సార్లు వీరు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా బకాయిలు మాత్రం చెల్లించలేదు. దీంతో వీరు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం సైతం ప్రైవేట్ ట్రక్కుల్లో యజమానులు ప్రభుత్వ దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నారు. ప్రైవేట్ మద్యం విధానం అమల్లోకి వస్తే వారే తమకు నచ్చిన వాహనాల్లో తరలించుకుంటారు. ప్రస్తుతం 193 ప్రభుత్వ మద్యం దుకాణాలకు ప్రైవేట్ వ్యక్తులు ట్రాన్స్‌పోర్టు చేస్తున్నారు. 23 ప్రైవేట్ బార్లు జిల్లాలో ఉండగా, బార్లకు ఆయా యజమానులే మద్యం తీసుకువెళుతున్నారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి వాహన రవాణా బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఎంపురం గ్రామానికి చెందిన కోరాడ రాజారావు (66) డబ్బుల విషయంలో భార్య రాజులమ్మతో గొడవ పడి ఈ నెల 23న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని శ్రీకాకుళం రిమ్స్ చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిమ్స్‌లో ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఆస్పత్రి వద్ద సెక్యూరిటీ సిబ్బంది

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన విషయాన్ని ఆక్కడి రోగులు గుర్తించారు. వారు రిమ్స్ వైద్యులకు తెలియజేయగా ఆ వ్యక్తిని ఎవరు తరలించాలో తెలియని పరిస్థితుల్లో మధ్యాహ్నం వరకు ఉంచారు. చివరికి ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తీసుకెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డును పోలీసు స్టేషన్‌కు పిలిచి ఎఫ్ఐఆర్‌లో అతని పేరు చేర్చడంతో రిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి కాసేపు విధులను బహిష్కరించారు. రిమ్స్ వరండాలో గుర్తు తెలియని వ్యక్తి చనిపోతే తమను బాధ్యులను చేయడం ఏంటని ప్రశ్నించారు. పలువురు వృద్ధులు, రోగులు రిమ్స్‌కు వచ్చి వార్డుల్లో చేరకుండా వరండాల్లో ఉంటున్నారని, 108 అంబులెన్స్‌ల్లో కొందరిని తెచ్చి ఆస్పత్రుల్లో చేర్పిస్తున్నారని, అలాంటి వారు తిరిగి ఇళ్లకు వెళ్లటం లేదని, పొరపాటున వారిని బయటకు పంపిస్తే రోగులకు పంపిస్తున్నామంటూ తమపై విరుచుకు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ విధులేమిటో స్పష్టంగా తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

డ్వామా పీడీ బాధ్యతల స్వీకరణ



సుధాకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బి.సుధాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం మెప్మా పీడీగా విధులు నిర్వహించిన ఈయన బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ప్రస్తుత ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ చిట్టిరాజు పలాస డీఎల్‌డీఓగా బదిలీపై వెళ్లారు. శుక్రవారం నూతన పీడీ కార్యాలయం చేరుకున్న సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

విద్యార్థుల పాట్లు



బురదమయంగా ఉన్న జూనియర్ కళాశాల రోడ్డు

ఎచ్చెర్ల క్యాంపస్: పాత జాతీయ రహదారి నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పక్క నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ఉన్న రోడ్డు బురద మయంగా మారింది. దీంతో విద్యార్థులు కాలినడకన, సైకిళ్లపై వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. బురద కారణంగా సైకిళ్ల చక్రాలు కదలని పరిస్థితి నెలకొంది. దీంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం లోపల నుంచి మైదానం పైనుంచి కళాశాలలకు వెళుతున్నారు. 400 మీటర్ల వరకు ఉన్న ఈ రోడ్డును సిమెంట్ రహదారిగా మార్చాలని విద్యార్థులు ఎప్పటినుంచో కోరుతున్నారు. మరో పక్క ఇదే రోడ్డుకు ఆనుకొని ఆర్‌టీఏ కార్యాలయం ఉంది. చాలా మంది వాహన చోదకులు ఈ కార్యాలయానికి నిత్యం వస్తుంటారు. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డును పక్కా రోడ్డుగా మార్చి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అంతిమయాత్రకు అవస్థలు!



వరి పొలాల మధ్యలో నుంచి సింహాచలం మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్తున్న దృశ్యం

రణస్థలం: జీవితానికి చివరి ఘట్టమైన అంతిమ యాత్రకు నెలివాడ గ్రామస్తులకు దారిలేకుండా పోయింది. మండంలోని నెలివాడ గ్రామ ప్రజలు స్వర్గస్తులైతే మరుభూమికి వెళ్లేందుకు సరైన దారి లేదు. దీంతో ఎవైన కాలం చేస్తే వారి మృతదేహలను శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు పచ్చనిపొలాలను తొక్కుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. శ్మశానానికి 2.5 ఎకరాల స్థలం ఉన్నప్పటికీ సరైన రోడ్డు సదుపాయం లేక గ్రామస్తులు అంతిమయాత్రలో నరక యాతన పడుతున్నారు. గ్రామానికి చెందిన ఎందువ సింహాచలం గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. అంత్యక్రియలు చేపట్టేందుకు కుటుంబ సభ్యులు మృతదేహాన్ని శుక్రవారం వరి పొలాల మధ్యలో నుంచి తీసుకొని వెళ్లాల్సి వచ్చింది. గ్రామస్థాయి రాజకీయాల వలన ప్రతిసారి సమస్య చర్చకు వచ్చినా కూడా పరిష్కారం చూపించే నాథుడే కరువయ్యారు. వర్షాకాలంలో ఎవరైన చనిపోతే శ్మశానానికి తీసుకు వెళ్లేందుకు వరి పొలాల్లో నుంచి సుమారు అర కిలోమీటర్ బురద దాటుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికై న అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరుభూమికి శాశ్వత రహదారి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రసాదాల తయారీ విభాగం తనిఖీ



ప్రసాదాల విభాగంలో సరుకులను పరిశీలిస్తున్న వెంకటరత్నం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో తయారుచేస్తున్న ప్రసాదాల్లో నాణ్యమైన సరుకులనే వినియోగించాలని జిల్లా ఆహార నియంత్రణాధికారి కె.వెంకటరత్నం సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆహార నియంత్రణ సహాయాధికారి లక్ష్మితో కలిసి అరసవల్లిలో ప్రసాదాల తయారీ విభాగాన్ని తనిఖీ చేశారు. లడ్డూ తయారీలో వినియోగిస్తున్న విశాఖ డెయిరీ ఆవు నెయ్యిని పరిశీలించారు. టెండర్ దారుల నుంచి సరఫరా అవుతున్న శనగపప్పు, జీడిపప్పు, మసాలా దినుసులు, బియ్యం ఇతరత్రా సామగ్రి శాంపుల్స్‌ను సేకరించారు. ఈ శాంపుల్స్‌ను ప్రయోగశాలకు పంపిస్తామన్నారు. కొందరు భక్తులతో మాట్లాడి ప్రసాదాల రుచి, శుభ్రతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



ఈఈ యోగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న డిప్యూటీ ఈఈలు

అరసవల్లి: శ్రీకాకుళం డివిజన్ పరిధిలో నిరంతర నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అన్ని చర్యలు చేపడతానని డివిజన్ ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు అన్నారు. ఆయన శుక్రవారం ఈఈగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ డివిజన్ పరిధిలో విద్యుత్ పరంగా ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే సిబ్బందిని సమన్వయ పరుచుకుని పరిష్కరించే విధంగా వ్యవస్థను నడిపిస్తానని చెప్పారు. అలాగే విద్యుత్ వినియోగదారుని సమస్య పరిష్కారమే తన విధుల్లో అత్యంత ప్రాధాన్యతాంశమని వివరించారు. వినియోగదారులు సమస్యలను 1912 నంబర్‌కు గానీ లేదా నేరుగా తనకు (9440812388) గానీ తెలియజేయవచ్చునని సూచించారు. అనంతరం మర్యాదపూర్వకంగా సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తిని కలిశారు. తర్వాత పలువురు అధికారులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. అంతకుముందు ఆయన అరసవల్లి వెళ్లి ఆదిత్యుడిని దర్శించుకున్నారు.

'స్వాభిమాన్'లో 41 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగులు ఎందులోనూ తీసిపోరని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాలో వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీతో కలిసి ఆయన వినతులు స్వీకరించారు. మొత్తం 41 వినతులు వచ్చాయి. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రతి నెల మూడో శుక్రవారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్) నిర్వహించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులు ఎందులోనూ తీసిపోరని, వారు ఆర్టీసీ బస్సుల్లో సులువుగా ప్రయాణించేందుకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

3 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషమాత ఆలయంలో అక్టోబర్ నెల 3 నుంచి 12 వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని అర్చకులు మోదుకూరి కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- బలగ నాగావళి తీరంలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో వచ్చే నెల 3 నుంచి 12 వరకు దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఒక ప్రకటనలో తెలిపారు.
- నానుబాలవీధిలోని విజయదుర్గాదేవి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తామని అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ తెలిపారు.
- మొండేటివీధిలోని షిరిడిసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో లలితాదేవి అమ్మవారికి నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కాకివీధిలోని ముత్యాలమ్మతల్లి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పాతబ్రిడ్జి రోడ్డులోని కనకదుర్గాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మాలధారణలు జరుగుతాయని అర్చకులు బుచ్చిబాబు తెలిపారు. బాకర్‌సాహెబ్‌పేటలోని దుర్గామహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని అర్చకులు సునీల్ శర్మ చెప్పారు. కత్తెరవీధి, గుజరాతిపేట, గుడివీధిలోని ప్రకాశరాయ జ్యోతిషాలయం, దేవీ పీఠాలలో కూడా ఉత్సవాలు జరుగుతాయని పీఠం నిర్వాహకులు తెలిపారు. భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆంధ్రా అండర్-19 జట్టుకు ఇద్దరు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అండర్-19 పురుషుల క్రికెట్ జట్టుకు శ్రీకాకుళం జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికై న వారిలో నంబాళ్ల సుశాంత్, రాజాన జున్నారావు ఉన్నారు. ఈ మేరకు శుక్రవారం ర్రాతి ఏసీఏ 16 మంది సభ్యులతో కూడిన జాబితాను వెల్లడించింది. వీరిద్దరూ త్వరలో జరిగే అంతర్ రాష్ట్ర వన్డే క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇటీవల జరిగిన నార్త్‌జోన్, అంతర్ జోనల్ క్రికెట్ టోర్నీలో వీరిద్దరూ రాణించారు. వీరి ఎంపిక పట్ల జిల్లా క్రికెట్ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

అల్లినగరంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

ఎచ్చెర్ల: మండలంలోని అల్లినగరం ఉన్నతపాఠశాలలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌డబ్ల్యూఎస్ స్వచ్ఛ భారత్ మిషన్ కో-ఆర్డినేటర్ కె.అమ్మాజీరావు విద్యార్థులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. స్వర్ణాంధ్ర దిశగా సలహాలు, సూచనలు చేశారు. వ్యక్తిగత, గ్రామ శుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కలు నాటడం, నీటి వినియోగం, నీటి పొదుపు, కాలుష్యం గురించి వివరించారు. కార్యక్రమంలో జలజీవన్ మిషన్ కో-ఆర్డినేటర్ ఎస్.మురళీమోహన్, మండల కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.